క్లుప్తంగా

తాగునీటి పథకం పనులకు శంకుస్థాపన

ఆత్మకూరురూరల్: గండ్లవేడులో తాగునీటి పథకం నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. జలజీవన్‌మిషన్ పథకం కింద రూ.6.5 లక్షల వ్యయంతో బోరుతో పాటు ఇంటింటికి పైపులైన్లు వేసి తాగునీరు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాంట్రాక్టర్ రాకేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి దొరస్వామినాయుడు, పాశం లింగయ్య, దాడి శ్రీనివాసులు, మోదేపల్లి రోశయ్య, మద్దినేని పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు మండలం చాకలకొండ, బుక్కాపురం సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న మూడు వలంటీర్ పోస్టులకు అర్హులైన వారు శుక్రవారం లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రాజేష్ బాబు గురువారం తెలిపారు. చాకలకొండ బీసీ మహిళ 1, జనరల్ 1, బుక్కాపురంలో బీసీ మహిళ 1 పోస్టు చొప్పున ఉన్నాయని వివరించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సంగం: సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని సిద్ధీపురం సచివాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. యూనిఫామ్ ధరించి విధులకు హాజరుకావాలని, సమయాన్ని పాటించాలని సూచించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఉదయగిరి: మనబడి నాడు-నేడు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ-2 శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని దుర్గంపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాస్‌రూం బేస్డ్ అసెస్మెంట్ పరీక్షలను, నాడు-నేడు పనులు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభరీతిలో ఆటపాటల ద్వారా బోధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జాఫర్‌అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి యోజన కేంద్రాలతో ప్రయోజనం

సంగం: ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన కిసాన్ సమృద్ధి యోజన కేంద్రాలతో రైతులకు ప్రయోజనం చేకూరుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయ రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు కాలం బుజ్జి రెడ్డి పేర్కొన్నారు. సంగంలోని ఇరిగేషన్ అతిథిగృహంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట సర్పంచ్‌లతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ నాయకులు కొండా రెడ్డి, నారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ శిక్షణా తరగతులు

ఆత్మకూరు: సీపీఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను శుక్రవారం నుంచి మూడ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఆత్మకూరు నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఉదయం 10 గంటల నుంచి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. తొలి రోజు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి జగదీష్, చివరి రోజైన 6వ తేదీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి పాల్గొంటారని తెలిపారు.

మణిపూర్‌లో మహిళలపై దారుణాలను అరికట్టాలి

కావలి: మణిపూర్‌లో సభ్యసమాజం తలదించుకునేలా మహిళలపై జరుగుతున్న దారుణాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో విద్యార్థినులతో గురువారం మానవహారం నిర్వహించారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

వరికుంటపాడు: మండలంలోని నారసింహాపురం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి నారసింహాపురం గ్రామానికి 1.5 కిలోమీటర్ల మేర సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన కింద రూ.కోటి నిధులతో నారసింహాపురం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా నారసింహాపురానికి రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చొరవతో సీసీరోడ్డు మంజూరవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

ఆత్మకూరు: ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి చేపట్టనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆత్మకూరు విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులు గురువారం ఆవిష్కరించారు. సీనియర్ నాయకుడు శివప్రసాద్, విజయరామిరెడ్డి, మస్తాన్, నరసింహారెడ్డి, ఓంకార్ పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

అల్లూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరుతున్నాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శంభునిపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పార్టీ, కులం, మతం, ప్రాంతం వంటి వివక్ష లేకుండా సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైఎస్సార్‌సీపీతో పాటు ఇతర పార్టీల వారికి ఎలాంటి సంక్షేమ పథకాలు అందకుండా చేశారన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. అందుకే గడప గడపకు వెళ్లిన సమయంలో ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, సర్పంచ్ పాటి రంజిత్‌కుమార్, వైస్ఎంపీపీ కొండూరు వాసు, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, బీద రమేష్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధిక్‌రెడ్డి, కొండూరు శ్రీను, నిమ్మల భాస్కర్, మనోహర్, మధురెడ్డి, తాండ్ర మల్లీ, పవన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, దాసరి వెంకటరమణయ్య, సుధ, రసూల్, వెంకయ్య, కాపులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు లబ్ధి



మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో లబ్ధి చేకూర్చిందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వం పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో జూలై 1 నుంచి 31వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశామని చెప్పారు. ఉదయగిరి నియోజకవర్గంలోని 95 సచివాలయాల పరిధిలో 82,839 కుటుంబాలను సర్వే చేసి 69,228 ధ్రువీకరణ పత్రాలను అందజేశామని వివరించారు. జగనన్న సురక్ష ద్వారా 99 శాతం మంది ప్రజల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, నాయకులు మేకపాటి అభినయ్‌రెడ్డి, జీ ఓబుల్‌రెడ్డి, కల్లూరి వెంకటేశ్వర్లురెడ్డి, కే కృష్ణ, గాజుల షర్ఫుద్దీన్, ఫరూఖ్‌అలీ, సుభాని, మట్ల రామయ్య, లక్ష్మయ్య, అశోక్ పాల్గొన్నారు.

పేదలకు మేలు జరిగితే ప్రతిపక్షాలు ఓర్వలేవు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అన్నిరకాలుగా మేలు చేస్తుంటే, ప్రతిపక్ష నేతలు ఓర్వలేకున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. దగదర్తిలో ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తుంటే టీడీపీ నేతలు కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని తెలిపారు. ముసునూరులో 8,000 మందికి స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తుంటే జనసేన నేతలు అల్లరి చేస్తున్నారన్నారు. జనసేన నేతలకు దమ్ముంటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత తీసుకోవాలని సవాల్ విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం గిన్నిస్ బుక్‌లో ఎక్కే స్థాయికి చేరిందన్నారు. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. అధికారులు, వలంటీర్లు నేరుగా ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కనపర్తి రాజశేఖర్, పానుగోటి అనూరాధ, గంధం ప్రసన్నాంజనేయులు, కుందుర్తి కామయ్య, షేక్.నాయబ్ రసూల్, అమరా వేదగిరి, నగ్గళ్ల శ్రీనివాసకిరణ్, తిరువీధి ప్రసాద్, చేవూరి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగనన్న సురక్ష నిదర్శనం



సమావేశమైన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందనేందుకు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమమే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండలాల నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలన ప్రజల వద్దకు చేరువైందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలో 86,544 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్ రావు ఈ నెల 10న ఆత్మకూరులో పర్యటిస్తున్నారని వెల్లడించారు. శ్రీధర్‌గార్డెన్స్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి చుక్కల భూముల రైతులకు హక్కు పత్రాలను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ కేవీ శ్రావణ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్లు సుబ్బిరెడ్డి,రఘునాథరెడ్డి, అధికార ప్రతినిధులు పూనూరు రామమనోహర్‌రెడ్డి, కే సిద్ధులునాయుడు, నాయకులు పీ రమేష్‌రెడ్డి, అంబటి కోటిరెడ్డి, కోనంకి శ్రీనివాసులునాయుడు, అంకిరెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, గంగాధర్‌రెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ఆత్మకూరురూరల్: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బోయలచిరివెళ్లలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. లేఅవుట్‌లో గృహ నిర్మాణాలకు మార్కింగ్ పూర్తి చేశామని, తాగునీటి సౌకర్యాన్ని త్వరలోనే కల్పిస్తామని తెలిపారు. గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రేవూరు అంకయ్య,గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలతో వెట్టిచాకిరి నేరం



చేజర్ల(సోమశిల): బాలలతో వెట్టిచాకిరి చట్టరీత్యా నేరమని సోమశిల ఎస్సై భోజ్యానాయక్ తెలిపారు. సోమశిలలోని దుకాణాల యజమానులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. దుకాణాల్లో బాలలను పనిలో పెట్టుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితులకు ఆర్థిక సాయం



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని అనంతరాయునియేని ప్రాంతంలో గత నెలలో జరిగిన అగ్ని ప్రమాదంలో గిరిజనులకు చెందిన విద్యుత్ మోటార్లు కాలిపోయిన విషయం తెలిసిందే. బాధిత గిరిజన కుటుంబాలకు 9వ వార్డు కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొప్పోలు చిన్నపరెడ్డి గురువారం రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ నాయకులతో కలిసి ఏలూరు పెద పెంచలయ్య, తిరుమలశెట్టి ధనమ్మకు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, కౌన్సిలర్లు తుమ్మల త్రివేణి, తిరుపతమ్మ, రాధికారెడ్డి, శివకోటారెడ్డి, పార్టీ నాయకులు ముజీబ్, జమీర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ వరం



బొమ్మవరంలో కిట్లు అందజేస్తున్న అనంతసాగరం ఎంపీపీ సంపూర్ణమ్మ



ఆత్మకూరు: ఎల్ఆర్‌పల్లిలో అవగాహన ర్యాలీ

చేజర్ల(సోమశిల): ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలకు వరమని అనంతసాగరం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ పేర్కొన్నారు. అనంతసాగరం మండలం బొమ్మవరం సచివాలయం పరిధిలోని అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం కిట్లను గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురవకుండా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారాన్ని అందజేస్తోందని తెలిపారు. ప్రస్తుతం టేక్‌హోం రేషన్ కింద 3కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె, 5 లీటర్ల పాలు, 25 గుడ్లతో పాటు ఇతర పౌష్టికాహార పదార్థాలు కిట్‌గా ఇంటికే అందజేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీని గురువారం ప్రారంభించారు. 12వ వార్డు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో వైస్‌చైర్మన్ షేక్ సర్దార్ గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు. ఎల్ఆర్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు షేక్ షకీలా ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఎన్‌ఎం పద్మ, ఎంఎస్‌కే షెహనాజ్, ఆయా విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఓటర్ల జాబితాపై సర్వే

ఉదయగిరి: మండలంలో ఈ నెల 10 నుంచి బీఎల్వోలు, బీఎల్ఏలతో ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే చేపడతామని తహసీల్దార్ జగదీష్‌బాబు తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సర్వేపై రాజకీయ పార్టీల నాయకులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. బీఎల్వోలు విధులు ముగించుకున్న అనంతరం ఓటర్ల జాబితాపై సర్వే చేపడుతున్నారని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు కలిసి సర్వే చేపట్టేలా చూడాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ఈ నెల 10 నుంచి బీఎల్వోలు, బీఎల్ఏలతో ఇంటింటి సర్వే చేయిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ మండల కన్వీనర్లు అక్కి భాస్కర్‌రెడ్డి, బయ్యన్న, సర్పంచ్ కే వెంకటేశ్వర్లురెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బాలయ్య పాల్గొన్నారు.

మేకపాటి వెంకురెడ్డికి ఘన నివాళి



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో మాజీ ఎంపీ మేకపాటి సోదరుల తండ్రి వెంకురెడ్డి 20వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. వెంకురెడ్డి సమాధి వద్ద ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్, శ్రీదేవమ్మ దంపతులతో పాటు గ్రామానికి చెందిన పలువురు నివాళులర్పించారు.

పరామర్శ

ఉదయగిరి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రావినూతల సుందరబాబు కుటుంబ సభ్యులను ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రావినూతల మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, ఫారుఖ్‌అలీ, జాషువా, పెంచలయ్య, మూలె వీరారెడ్డి, తదితరులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వరికుంటపాడు: మండలంలోని జడదేవి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై కందుకూరు డీఎల్‌పీఓ కృష్ణమోహన్ గురువారం విచారణ చేపట్టారు. జడదేవి పంచాయతీలో 14,15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని పలువురు గ్రామస్తులు ఇటీవల డీపీఓకు ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణ చేపడుతున్న సమయంలో వాదోపవాదాలు చోటు చేసుకోవడంతో అధికారులు వాయిదా వేశారు. విచారణ తిరిగి ఎప్పుడు చేపట్టేది ప్రకటిస్తామని డీఎల్‌పీఓ తెలిపారు. సర్పంచ్ కామేపల్లి పద్మజ, ఉపసర్పంచ్ కొండలరావు, ఈఓపీఆర్డీ వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఆర్డీఓ తనిఖీలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం ఖాదర్‌పూర్, నెర్దనంపాడు, కదిరినేనిపల్లి బీఎల్ఓ కేంద్రాలను ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితాలను పరిశీలించి 0 నంబరుతో నమోదైన ఓట్లను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చిన్నమాచనూరు సచివాలయంలో రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది హాజరుపై ఆరాతీశారు. సమయాన్ని పాటించి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట మర్రిపాడు తహసీల్దార్ ఆనంద్‌రావు, ఆర్ఐ సురేంద్ర, తదితరులు ఉన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు: ఆత్మకూరు నూతన సీఐగా జీ వేణు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆత్మకూరు సీఐగా పనిచేస్తున్న నాగేశ్వరరావు మార్చిలో ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పట్నుంచి సంగం సీఐ రవినాయక్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఏసీబీ సీఐగా పనిచేస్తున్న జీ వేణును ఆత్మకూరు సీఐగా జిల్లా ఎస్పీ బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన సీతారామపురం, అనంతసాగరం, సంగం మండలాల ఎస్సైగా విధులు నిర్వహించారు. నూతన సీఐను సర్కిల్ పరిధిలోని ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. నూతన సీఐ జీ వేణు మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతం తనకు సుపరిచితమేనని, ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతలను కాపాడడంపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ఎస్సైలు ముత్యాల రావు, రాజేష్, సాయిబాబా, నరేష్, విశ్వనాథరెడ్డి, సంతోష్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'పై సన్నాహక సమావేశం

ఉదయగిరి(వింజమూరు): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజేష్‌బాబు ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రపై సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజేష్‌బాబు మాట్లాడుతూ అక్టోబరు 2న ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం ఎంపిక చేసిన ఐదు రకాల క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. 17ఏళ్లు నిండిన యువత పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు. మండల స్థాయి పోటీల నిర్వహణకు ఉటుకూరు, వింజమూరు బాలుర, చాకలకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా మైదానాలను ఎంపిక చేసినట్లు వివరించారు. వింజమూరులోనే క్రికెట్ టోర్నమెంట్‌కు గ్రౌండ్‌ను గుర్తించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రవీంద్రబాబు, ఎంఈఓలు మధుసూదన్‌రెడ్డి, జ్యోతి, ఎస్సై కోటిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్లు

కావలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన కావలి పట్టణం, మండలంలోని 17 ఏళ్లు నిండిన క్రీడాకారులు వార్డు/గ్రామ సచివాలయాల్లో శుక్రవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని కావలి ఎంపీడీఓ కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు ఆడుదాం ఆంధ్ర కోఆర్డినేటర్ పీ చిరంజీవిని 94902 47854 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆడుదాం ఆంధ్రపై సమావేశం

చేజర్ల: మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రపై శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్‌కే కరీముల్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీటీలు, పీడీలు తప్పక సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.